## సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు



హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

## ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

### భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్‌పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్‌పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతులు పొందింది. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

### ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.



### సమస్యలు.. సవాళ్లు!

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గనులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికితీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు






మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

## అన్న ఇంట్లో 2 కిలోల బంగారం చోరీ

### కేసును ఛేదించిన పోలీసులు.. రూ.1.2 కోట్ల సొత్తు స్వాధీనం

### 12 మంది ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

### వివరాలు వెల్లడించిన కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వ్యాపారంలో ఎదుగుతున్న అన్న ఇంటికి సొంత తమ్ముడే కన్నం వేశాడు. అన్న ఇంట్లో ఉన్న వారందరినీ మరణాయుధాలతో బెదిరించి 2 కిలోల బంగారాన్ని దోపిడీ చేయించాడు. పోలీసులకు దొరకుండా ఉండేందుకు ఒక న్యాయవాది సూచనలు తీసుకున్నాడు. హైదరాబాద్ దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 12న జరిగిన ఘటనను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించి రూ.1.2 కోట్ల విలువైన సొత్తును రికవరీ చేశారు. ఈ వివరాలను ఆదివారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. దోమలగూడలో నివాసముండే రంజిత్ ఘోరీ, ఇంద్రజిత్ ఘోరీలో వెస్ట్‌బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చారు. రంజిత్ ఘోరీ బంగారు ఆభరణాలు తయారు చేసే దుకాణాలు నిర్వహిస్తూ తన వ్యాపారాన్ని పెంచుకున్నాడు. అతని సోదరుడు ఇంద్రజిత్ ఘోరీ బెట్టింగ్, ఇతర చెడు అలవాట్లకు బానిసై ఉన్నదంతా పోగుట్టుకున్నాడు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌లో అల్తాఫ్ మహ్మద్, బార్‌లో సయ్యద్ ఇర్ఫాన్ అహ్మద్‌తో ఇంద్రజిత్‌కు దోస్తీ ఏర్పడింది. భారీగా సంపాదిస్తున్న తన సోదరుడి ఇంటి నుంచి ఎలాగైనా దోపిడీ చేయాలని వారితో ప్లాన్ చేశారు. న్యాయవాది నూర్ ఉల్లా సహకారం తీసుకొని, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో రౌడీషీటర్ మహ్మద్ అర్బాజ్ సహకారంతో దోపిడీకి ప్లాన్ చేశారు.

### దోపిడీ జరిగిందిలా..

రౌడీషీటర్ మహ్మద్ అర్బాజ్ సోహెబ్‌ఖాన్, గులాం ముఖ్దుం, షేక్ ఉస్మాన్, షేక్ అల్లాఉద్దీన్, షేక్ అక్రం, అల్తాఫ్ మహ్మద్ ఖాన్, సయ్యద్ ఇర్ఫాన్, హబీబ్ ఉస్సేన్, న్యాయవాది నూర్ ఉల్లా మరికొందరితో ఇంద్రజిత్ జత కట్టాడు. వీరంతా కలిసి ఈ నెల 12న దోమలగూడ అరవింద్‌నగర్ కాలనీలో నివాసముంటున్న బంగారం వ్యాపారి రంజిత్ ఘోరీ ఇంట్లోకి చొరబడి కత్తులు, తుపాకులతో కుటుంబసభ్యులను బెదిరించి, అడ్డొచ్చిన వారిపై దాడి చేసి 2 కిలోల బంగారు నగలు దోచుకొని, ఇన్నోవా కారులో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులూ రంగంలోకి దిగారు. కేసుతో సంబంధమున్న 12 మందిని అరెస్ట్ చేశారు. షాబాజ్, నజీర్, జహీర్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 1,228 గ్రాముల బంగారు ఆభరణాలు, 616 గ్రాముల వెండి, 2 కిలోల ఇత్తడి వస్తువులు, ఇన్నోవా కారు, మరణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.2 కోట్లు ఉంటుందని సీపీ వెల్లడించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్‌యాదవ్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, గాంధీనగర్ ఏసీపీ మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

## బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

### గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్‌ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

